క్లుప్తంగా

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

మచిలీపట్నంటౌన్: ఈ నెల 29వ తేదీ నిర్వహించే సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. యాత్ర, బహిరంగ సభకు తరలిరావాలని నగరంలోని పలు డివిజన్లలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి ప్రజలను ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చేస్తున్న మేలువివరించేందుకు ఈ సాధికార యాత్ర బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. కరపత్రాల పంపిణీతో పాటు పలు డివిజన్లలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

పెడన: పట్టణ, మండల, యువజన ఆర్యవైశ్య సంఘాలు, వాసవి క్లబ్, వాసవి సేవాదల్, వాసవి మండలి ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన కార్యక్రామాన్ని నిర్వహించారు. స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలోని చిట్టూరి మాధరావు తోటలో ఏర్పాటు చేసిన ఈ వన సమారాధనలో తొలుత వాసవి మండలి మహిళలచే లలిత పారాయణం, ఉసిరి, రావి చెట్ల కింద శివపార్వతుల పూజలతో పాటు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా)తో పాటు ఆయా సంఘాల నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాఖలవారీగా విధులు కేటాయింపు

కోడూరు: కార్తిక పౌర్ణమి సందర్భంగా హంసలదీవి సాగరతీరంలో గస్తీ నిర్వహించేందుకు వచ్చిన పోలీస్ సిబ్బందికి విధులు కేటాయించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ సిబ్బంది ప్రత్యేక సమావేశం నిర్వహించి, పని చేయాల్సిన ప్రదేశాలను వివరించారు. నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 100 మంది పోలీస్ సిబ్బంది హంసలదీవి నుంచి సంగమం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పకుండా పని చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో పాటు సేవ చేసేందుకు వచ్చిన విద్యార్థులు పర్యాటకులకు సూచనలిచ్చి అప్రమత్తం చేయాలన్నారు. ఎస్ఐ రాజేంద్రప్రసాద్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

గూడూరు: మచిలీపట్నంలోని టౌన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ టీం సెలక్షన్‌లో మండలంలోని కప్పలదొడ్డి చిన్న బి.శివ నాగ ప్రభు సత్తా చాటాడు. ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఎంపికలో విశేష ప్రతిభను కనబరిచిన ప్రభును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో అనంతపురం జిల్లా రాప్తాడు లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రభు పాల్గొంటాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రభువుకు ప్రముఖులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా అభిమానులు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గూడూరు:మండలంలోని పోసినవారిపాలెం, ముక్కొల్లు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ యాత్ర గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో సుబ్బారావు నోడల్ అధికారిగా వ్యవహరించిన గ్రామసభలో అడిషనల్ డీపీఎం .కె. నాగమల్లేశ్వరి ప్రకృతి వ్యవసాయం వలన ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఏవో శివప్రసాద్, మాస్టర్ ట్రైనర్ స్వామి బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు

ఆర్థిక సాయం అందజేత

చల్లపల్లి: జర్నలిస్ట్ క్లోపల్లి చంద్ర ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకోవటం బాధాకరమని ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఏపీ ఉద్యోగులు జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం చల్లపల్లి వచ్చిన బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏలూరు ఇన్‌చార్జి డీపీఓ క్లోపల్లి చంద్రశేఖర్, గుడివాడ డీఎల్‌పీఓ క్లోపల్లి కుసుమ కుమారి తమ లవ్లీ ఫ్యామిలీ వాట్సాప్ గ్రూప్ ద్వారా సమీకరించిన రూ.లక్షా 62,500 ఆర్థిక సహాయాన్ని చంద్ర పిల్లలు హేమంత్, హరిణిలకు అందించారు. చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డిసెంబరు 8 నుంచి కార్తిక దీపోత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేట గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో డిసెంబరు 8, 9, 10 తేదీల్లో కార్తిక దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దత్తాశ్రమం కార్యవర్గ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 7.30 గంటలకు కార్తిక దీపోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు 7 గంటలకు విశేష అర్చన, 7.30 గంటలకు దీపోత్సవం, మహా మంగళ హారతులు, కాగడ హారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, దళిత జేఏసీ నాయకులు



మగ్గాల కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పోర్టు రోడ్డులోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఎంతో మహోన్నతంగా అంబేద్కర్ తీర్చిదిద్దారని చెప్పారు. దేశంలో విభిన్న జాతులు, మతాలు, కులాలు ఉన్నప్పటికీ లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించి అన్ని వర్గాలకు న్యాయం చేశారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని పలు దేశాలు అనుకరించి అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. అంబేద్కర్ నేతృత్వంలో తయారు చేయబడిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాల మన్ననలు పొందుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, దరిసే శ్రీరాం, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు. అలాగే దళిత జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద బాబు (జానీ) పూలమాల వేసి నివాళులర్పించారు. కిట్టు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని తయారుచేసి పార్లమెంట్‌లో సమర్పించిన ఈ ప్రత్యేకమైన రోజును భారత రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించుకున్నామని తెలిపారు. దళిత జేఏసీ జిల్లా కార్యదర్శి బేతపూడి రవి, నాయకులు దార్ల చెన్నకేశవరావు, ప్రత్తిపాటి ప్రేమ్‌కుమార్, దమ్ము కేశవరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు. రాజుపేట మగ్గాలకాలనీలో అంబేద్కర్ విగ్రహానికి 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం...

అవనిగడ్డ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు తలమానికమని శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ పరిధిలోని సీతాయిలంక వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా భారత్ అన్నింటా అభివృద్ధి సాధించడానికి, మంచి పాలన సాగించడానికి మన రాజ్యాంగం ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావుతో పాటు పలువురు ఎస్సీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని స్థానిక గ్రంథాలయంలో ఘనంగా చేశారు. పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు భారత రాజ్యాంగం గొప్ప తనాన్ని వివరించారు. ఈ సందర్భంగా పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాస్ పాల్గొన్నారు.

పెడన:భారత రాజ్యాంగ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెడన పట్టణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. భారత రాజ్యాంగ పుస్తకాలు కమిటీ అధ్యక్షుడు, సీనియర్ కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు ప్రముఖులకు, యువతకు అందజేశారు. పెడన పురపాలక సంఘం సీనియర్ కౌన్సిలర్, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, బాబులాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్, తిప్పపండు, కమిటీ వైస్ ప్రెసిడెంట్ నందమూరి బాలకృష్ణ, సీనియర్ దళిత నాయకులు బొడ్డు మామిళ్ల, నవీన్, వాసు, ఆనంద్, రమేష్, సత్యనారాయణ, పున్నమయ్య, సాగర్, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని దేవరపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆ గ్రామంలో రాజ్యాంగ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది.

● పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ ఎస్సీ నాయకులు ముత్యాల మురళి, కోడూరు శ్రీనివాసరావు, బొర్రా మహేష్‌లతో పాటు పార్టీ నాయకులు వీణం రాము తదితరులు పాల్గొన్నారు.

● పెడన ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్చుతరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవాన్ని గూడూరులో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పర్ణం పెదబాబు ఆధ్వర్యంలో గూడూరులోని పార్టీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మధుసూదనరావు, రామరాజుపాలెం సర్పంచ్ పరసా రాజులు, నాయకులు లింగం విజయకుమార్, లంక సుబ్రహ్మణ్యం, బత్తిన నాగ త్రినాథ్, వేము ఆనంద్, గమిని కృష్ణ, జక్కా రాజేష్, భాను పాల్గొన్నారు.



మున్సిపల్ పార్కులోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ పుస్తకాలతో కౌన్సిలర్లు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లి తదితరులు



సీతాయిలంకలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నేను.. మీలో ఒకడినే...

● యాదవ సంఘీయుల ఆత్మీయ కలయికలో ఎంపీ బాలశౌరి
● శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపానికి రూ. 1.25 కోట్ల నిధులు



ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నంటౌన్: నేను.. మీలో ఒకడినే.. ఎల్లప్పుడు మీకు అండగా ఉంటాను. మీకు ఏ కష్టమొచ్చినా నా వంతు సహకారం అందిస్తానని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండంలో ఆదివారం యాదవ సంఘీయుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ నాలి మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి మాట్లాడారు. తన గ్రామంలో మా ఇంటి చుట్టూ యాదవులే ఉంటారని చిన్నప్పటి నుంచి వారితో కలిసి పెరిగానన్నారు. అందువల్ల యాదవులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. మచిలీపట్నంలో యాదవులు 2004 నుంచి నిర్మించ తలపెట్టిన శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపం నిధుల లేమితో పునాది దశలోనే నిలిచిపోయిందని తెలిపారు. కోటి రూపాయలు అవసరమవుతాయని ఈ ప్రాంత నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. దీంతో ఆయిల్ ఇండియా సీఎండీతో ఈ కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరానన్నారు. ఒప్పుకున్న ఆయన ఇప్పటికే రూ. 50 లక్షలు విడుదల చేశారని, మరో రూ. 50 లక్షలు త్వరలో విడుదల చేస్తారన్నారు. మచిలీపట్నంలో లేని విధంగా ఈ కల్యాణ మండపం నిర్మాణం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అవసరమైతే మరో రూ. 25 లక్షలు ఇస్తానని, అదీ చాలకుంటే మరిన్ని నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో సభలోని యాదవులు ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ వారి ఆనందోత్సాహాన్ని వ్యక్తం చేశారు. పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న యాదవులకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రుణమేళా నిర్వహించామని, మరో రుణమేళా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుక్కల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు కొంత నిధులు ఇచ్చినప్పటికీ కల్యాణ మండపం నిధులు ముందుకు సాగలేదన్నారు. మండపం నిర్మాణానికి ఎంపీ బాలశౌరికి విన్నవించిన వెంటనే నిధులు మంజూరుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన చేస్తున్న మేలు యాదవులు మర్చిపోరాదన్నారు. ఈ సందర్భంగా యాదవులు ఎంపీ బాలశౌరిని గజమాలతో సత్కరించారు. తొలుత మూడు స్తంభాల సెంటరులో ఎంపీ బాలశౌరికి యాదవ సంఘీయులు ఘన స్వాగతం పలికి కల్యాణ మండపం వరకు ర్యాలీగా తీసుకొచ్చారు. సమావేశంలో కలిదిండి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, గుంటూరు జిల్లా డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పాములు, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి శివ, అంజత్‌పాషా, మాదివాడ రాము, యాదవ సంఘ నాయకుడు పల్లపాటి చినబాబు, ఏవీఆర్ రాజు, బొర్రా సాయిబాబు, కెకె చింతయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక వనసమారాధన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దేశాయిపేట గో సంఘంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. వ్రతాన్ని అర్చకుడు ముక్తేవి శ్రీనివాస్‌శిఖి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆధ్వర్యంలో అనంతరం నగరంలోని మెడికల్ షాపు దుకాణాల యాజమానులు కుటుంబ సమేతంగా పాల్గొని కార్తీక సహపంక్తి వనభోజనాలు చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హాజరయ్యారు. వనసమారాధన సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఆయన బహుమతులను అందజేశారు. 32వ డివిజన్ వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ చింతా మౌనిక, అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయగిరి సురేష్, కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు, కోశాధికారి కె అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవివార్పు(మోపిదేవి): కార్తిక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని మోపిదేవివార్పు వద్ద మామిడి తోటలో ఆదివారం వన సమారాదన నిర్వహించారు. అవనిగడ్డ ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరావు ఏర్పాటు చేసిన వన సమారాధలో దివిసీమలోని పలు ప్రాంతాలకు చెందిన అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంప్రదాయ పద్ధతిలో తెలుగు వంటకాలతో చేసిన పదార్థాలను వడ్డించారు. అధిక సంఖ్యలో మహిళలు, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగజ్జేయమానంగా నగరేశ్వరుని జ్వాలాతోరణం



నగరేశ్వరస్వామి సన్నిధిలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న భక్తులు



ఉత్సవమూర్తులతో గ్రామస్తుల ప్రదక్షిణ



గోదాదేవి అమ్మవారి రంగవల్లి చుట్టూ దీపకాంతులు



కృత్తివెన్ను శివాలయం వద్ద జ్వాలాతోరణం



ఆలయంలో జ్వాలా తోరణం దృశ్యం



కృష్ణానది తీరంలో కార్తిక దీప ప్రమిదలతో సామూహిక హారతి ప్రదర్శన చేస్తున్న మహిళలు



జ్వాలా తోరణం కిందగా దాటుతున్న స్వామివారి పల్లకి



రామలింగేశ్వరుని మండపంలో నవహారతులు ఇస్తున్న పండితులు

నాగాయలంక: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని భావదేవరపల్లిలోని నూతన శ్రీఅన్నపూర్ణదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏడాది జ్వాలా తోరణం పూజలు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీహరి బ్రహ్మత్వంలో ఘనంగా జరిగాయి. కన్యకా పరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి దేవస్థానం 31వ వార్షిక కార్తిక మాసోత్సవాలలో ఆదివారం రాత్రి జ్వాలా తోరణం కనులపండువగా జరిగింది. మూల విరాట్‌లకు అర్చకులు కొల్లిపర సుబ్బారావు పూజలు జరిపారు. ధ్వజస్తంభం ఎదుట ఎండు గడ్డితో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తోరణాలను ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, చిట్టా శివనాగేశ్వరరావు, ఆకుతోట సీతారామయ్య చేతులమీదుగా ప్రజ్వలింప చేశారు. భావదేవరపల్లిలో ప్రత్యేక అలంకారంతో కోటి ఒత్తులు వెలిగించారు.

కృష్ణమ్మ చెంత కార్తికదీపం

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపం వద్ద ఆదివారం రాత్రి జరిగిన సామూహిక కార్తీక దీప ప్రమిదల ప్రదర్శన, నవహారతులు కార్యక్రమానికి భక్తజనులు పోటెత్తారు. కార్తీక అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వైభవంతో రూపకల్పన గావించిన మహిళల సామూహిక హరతులు కార్యక్రమం శోభాయమానంగా సాగింది. శివయ్య, నందీశ్వరులకు పూజలు చేశారు. చాగంటిపాడు శివనాగ వరప్రసాద్, జ్యోత్స్న దంపతులు కోటిఒత్తుల దీపం వెలిగించారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్‌శర్మ, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖరన్ హారతుల కార్యక్రమం నేత్రపర్వంగా ప్రదర్శించారు. శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రఘుశేఖర్, బోయపాటి రాము, కనిగంటి వెంకటనారాయణ, ఇతర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పెడన:పట్టణంలో వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్ర కార్తికమాస పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. జ్వాలాతోరణం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు గూడురు ఆగస్త్యయ్య, శివదత్తులు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, గౌరీ సహిత రుద్రహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమాలు ఓకంటి వెంకటరెడ్డి కుమార్ దంపతులచే నిర్వహించారు. అర్చకుడు భాస్కరశర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. స్వామి వారికి జ్వాలతోరణం నిర్వహించారు.

నగరంలోని ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జ్వాలతోరణం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు వారి కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హాజరయ్యారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రాగం ధర్మరాజు, 24వ డివిజన్ కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, రాజు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండల కేంద్రంలోని శివాలయం వద్ద నిర్వహించిన జ్వాలాతోరణం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచి శివాలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం వేళ జ్వాలాతోరణం నిర్వహించినట్లు అర్చకులు మురళీకృష్ణ తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు.

మోపిదేవి:స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాలా తోరణం నిర్వహించారు. తొలుత స్వామివారిని ప్రత్యేక పల్లకిపై ఆలయ ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం భక్త మహాశయులు వీక్షించుచుండగా జ్వాలా తోరణానికి ఆలయ ఏసీ ఎన్ సూర్య చక్రధరరావు, చల్లపల్లి సీఐ నాగప్రసాద్ తోరణం వెలిగించారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో, వేద పండితులు, అర్చక స్వాములు వేద మంత్రాలతో ప్రత్యేక పల్లకిపై ఉన్న స్వామివారిని జ్వాలా తోరణం కిందగా దాటించారు. మోపిదేవి ఎస్ఐ వీరవెంకట సత్యనారాయణ ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ, పెద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో కోలాహలం..

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు క్యూలైనులో నిలిచారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ వీర వెంకట సత్యనారాయణ క్యూలైనులో భక్తులను లోపలకు తరలించారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంటుమిల్లి : మండల పరిధిలోని పలు ఆలయాల్లో ఆదివారం కార్తీక పూర్ణిమ దీపోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శివాలయాల్లో దీపోత్సవాలు, జ్వలాతోరణాలు భక్తిశ్రద్ధలతో చేశారు. బంటుమిల్లి, పెడుతుమిడి, కంచడం, అర్తమూరు తదితర గ్రామాల్లో శివాలయాలు, వైష్ణవాలయాలు భక్తుల నామ స్మరణతో మార్మోగాయి.

కోడూరు: గంగాభవానీ అమ్మవారి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి, గోదాదేవి అమ్మవారి రంగవల్లుల తీర్చిదిద్ది, వాటి చుట్టూ కార్తీకదీపాలను వెలిగించారు. దేవతామూర్తుల రంగవల్లులను ఏర్పాటు చేసి, వాటిల్లో మహిళలు దీపాలు వెలిగించారు. ప్రధానార్చకులు కొమ్మూరి శ్రీనివాస శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోలాహలంగా హంసలదీవి తీరం



సాగరతీరంలో పర్యాటకుల కోలాహలం

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. కార్తిమాసంతో పాటు ఆదివారం సెలవు కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి సరదాగా గడిపారు. వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు తాకిడి అధికగా కనిపించింది. మహిళలు తీరంలోనే ఇసుకతో సైకత శివలింగాలు తయారు చేసి, వాటి ముందు కార్తిక దీపాలు వెలిగించి భక్తిభావం చాటుకున్నారు. సముద్రుడికి పసుపు, కుంకుమను తర్పణలుగా వదిలారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సందడి చేశారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు చేపట్టారు. పర్యాటకులు సూచనలిస్తూ జాగ్రత్తలు చేపట్టారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాగతీరంలో జరిగే కార్తీకస్నానాలు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ తెలిపారు.

పాండు రంగస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



రావిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ స్వామి ఉత్సవాలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం రుక్మిణి అమ్మవారికి కుంకుమ పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపారాధన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోలాటం, పండరీ భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు టీకే నరసింహం పర్యవేక్షించారు. సోమవారం కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాలు ఉండటంతో ఆదివారం రాత్రికే ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. తెల్లవారుజామున మంగినపూడి బీచ్ వద్ద సముద్రస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు విచ్చేశారు.